

లారీ రవాణా.. దివాలేనా !

- సంక్షోభంలో కూరుకుపోతున్న లారీ రంగం
- లీటర్ డీజిల్ ధర రూ.98కి చేరువలో..
- 25 శాతానికి పైగా పెరిగిన విడిభాగాల ధరలు
- ఐదేళ్ల కిందట నాటి కిరాయిలే నేటికీ..
- లారీ నడపడానికి ముందుకు రాని డ్రైవర్లు
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తగ్గిన లారీల రవాణా

మూలిగే నక్కపై తాటి కాయ పడిన చందంగా మారింది లారీ రవాణా రంగ పరిస్థితి. డీజిల్, ఇన్సూరెన్స్, టోల్‌ట్యాక్స్‌లు, స్పేర్‌పార్ట్స్ మోతతో ఇప్పటికే చుక్కలు కనిపిస్తున్నాయి. తాజాగా కిరాయిలు దొరక్క ఏమి చేయాలో పాలుపోక లారీ యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఒకవేళ అరకొరగా కిరాయిలు దొరికినా ఐదేళ్ల క్రితం నాటి ధరలే లభిస్తుండడంతో మిగులుబాటు కాక నష్టపోతున్నారు. మరోవైపు డ్రైవర్ల కొరత వేధిస్తోంది.

తిరుపతి మంగళం : ఒకప్పుడు లారీ ఉందంటే అబ్బో లారీ యజమానా అనే మాట తరుచూ వినిపించేది. అయితే ఇదంతా గతం. రవాణాలో కీలక పాత్ర పోషించే ఈ లారీ రంగం ప్రస్తుతం కళావికలమవుతోంది. డీజిల్ లీటర్ ధర రూ.98కి చేరువలో ఉండడం.. జాతీయ రహదారిపై ప్రతి 30 కిలో మీటర్లకో టోల్‌గేట్, జీఎస్టీ మోతతో ఆదాయం సంగతి దేవుడెరుగు.. కనీస ఖర్చులొస్తే చాలు మహాప్రభో అనే స్థితిలో ఉన్నారు లారీ యజమానులు.

అప్పటికీ.. ఇప్పటికీ ఎంతో వ్యత్యాసం..

గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 30వేలకు పైగా లారీలు ఉండేవి. ప్రధానంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మైన్స్(కంకరరాళ్లు), ఇసుక, ధాన్యం, బియ్యం వంటివి రవాణా చేయడంలో లారీ పాత్ర కీలకంగా ఉండేది. లాభాలు కూడా ఎక్కువగా ఉండడంతో వీటిని కొనుగోలు చేసేందుకు ఎంతోమంది ఉత్సాహం చూపేవారు. అయితే కాలక్రమేణా లారీ రంగం పతనావస్థకు చేరుతోంది. కొత్తగా కొనుగోలు చేసే వారి సంగతి అటుంచితే ఉన్నవి కాపాడుకోవడమే గగనంగా మారింది. ప్రస్తుతం జిల్లాలో లారీ సంఖ్య 5 వేలు లోపే ఉంటాయని సమాచారం.

టైర్లు కొనలేక బెంబేలు...

టైరు ధర మూడేళ్ల కిందట రూ.16 వేలు ఉంటే, ప్రస్తుతం అది రూ.21,500లకు చేరింది. రేడియల్ టైర్లు ఒక్కొక్కటి రూ.22 వేలు ఉంటే ప్రస్తుతం రూ.28 వేలకు పెరిగాయి. ఇంజిన్ ఆయిల్‌తో పాటు విడిభాగాల ధరలను 20శాతం మేర పెంచారు. లారీని బట్టి నిర్వహణ రూ.20 వేలు నుంచి రూ.30 వేల వరకు ఉంటుంది. అన్ని పత్రాలున్నా పోలీస్, రవాణా అధికారులకు ఎంతో కొంత ముట్టజెప్పందే అక్కడి నుంచి పంపే పరిస్థితి లేదు.

డ్రైవర్లూ లేరే..

ఇదంతా ఒక సమస్య అయితే అంతకన్నా పెద్ద సమస్య డ్రైవర్ల కొరత. రవాణా రంగం సంక్షోభానికి డ్రైవర్ల కొరత కూడా ఓ కారణం. కొత్తగా అందులోకి వచ్చేందుకు ఎవరూ ఆసక్తి చూపడంలేదు. పైగా దీనికిచ్చే కమీషన్‌ను పది శాతానికి పెంచారు. ఉదాహరణకు కిరాయి రూ.లక్ష ఉంటే అందులో రూ.10 వేలు డ్రైవర్‌కు ఇవ్వాల్సిందే. లోడింగ్, అన్‌లోడింగ్ బాధ్యతను యజమానే భరించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ మేరకు కిరాయి వస్తే అన్ని ఖర్చులు పోనూ రూ.20 వేలు కూడా లారీ యజమానికి మిగలని పరిస్థితి నెలకొంది.

కాలం మారింది.. కిరాయే మారలేదు...

రవాణా రంగంలో నెలకొన్న తీవ్రమైన పోటీ కారణంగా ఐదేళ్లగా ఉన్న కిరాయే నేటికీ కొనసాగుతోంది. లోడింగ్ అంతంత మాత్రంగానే ఉంది. మరోవైపు సరుకుల రవాణాకు ఇటీవల కాలంలో రైళ్ల వైపు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. రాబడి తగ్గి.. ఖర్చులు అమాంతం పెరగడంతో కొందరు యజమానులు తమ లారీలను విక్రయానికి పెట్టారంటే సమస్య తీవ్రత ఏమిటో అర్థం చేసుకోవచ్చు. మరికొందరు బయటకొచ్చి ఏ వ్యాపారం చేయలేక అందులోనే కాలం వెళ్లదీస్తున్నారు.

అన్నింట్లో మోతే...

- పెరిగిన ఇన్సూరెన్స్, టైర్లు, విడి భాగాల ధరలు ఈ రంగాన్ని కుదేలు చేస్తున్నాయి.
- లారీ విలువను బట్టి థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ రెండేళ్ల క్రితం రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు ఉండేది. ప్రస్తుతం ఇది రూ.40 వేల నుంచి రూ.80 వేల వరకు పెరిగింది.
- 22 చక్రాల కొత్త లారీకి ఇన్సూరెన్స్ రూ.1.25 లక్షల వరకు ఉంది.
- లారీని బట్టి త్రైమాసిక పన్ను రూ.8 వేల నుంచి రూ.14 వేల వరకు ఉంది.
- నేషనల్ పర్మిట్‌కు రూ.17 వేలు అదనం
- ఏడేళ్లు దాటిన రవాణా వాహనానికి ఏటా గ్రీన్‌ట్యాక్స్‌ను చెల్లించాల్సి ఉంటుంది.

ఇన్సూరెన్స్, గ్రీన్‌ట్యాక్స్ తగ్గించాలి..

లారీలు తిప్పడం ప్రస్తుతం కష్టంగా మారింది. ఇన్సూరెన్స్, గ్రీన్‌ట్యాక్స్‌ను అమాంతంగా పెంచేశారు. ఈ రంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శీతకన్ను వేశాయి. జీఎస్టీతో యజమానులపై పెనుభారం పడింది. టోల్‌గేట్ల సంఖ్యను తగ్గించడంతో పాటు కొత్తగా వచ్చే ఆటోమెటిక్ ఫిట్‌నెస్ స్టేషన్లను నిలిపివేయాలి. రవాణా రంగాన్ని ఆదుకోకపోతే పూర్తిగా వారి వారి లారీలను విక్రయించుకునే పరిస్థితి వస్తుంది.

– లారీ అసోసియేషన్ నాయకులు

క్లుప్తంగా

గంగమ్మ ఆలయానికి రూ.లక్ష విరాళం



ఆలయ ఈఓ జయకుమార్‌కు విరాళం అందజేస్తున్న దాతలు జ్యోతి, కృష్ణకాంత్

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి తిరుపతికి చెందిన జ్యోతి, వి.కృష్ణకాంత్ మంగళవారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ ఈఓ ఎ.జయకుమార్‌కు అందజేశారు. అమ్మవారి ఆలయ నిర్మాణానికి విరాళం వినియోగించాలని దాతలు కోరారు.

నూతన కమిటీ ఎంపిక



అధ్యక్షుడు శ్రీనివాసులు | ప్రధాన కార్య దర్శి వెంకటేష్

తిరుపతి కల్చరల్: కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా నూతన కమిటీని మంగళవారం ఎంపిక చేశారు. ఈమేరకు యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన జిల్లా మహాసభ ముగింపు కార్యక్రమానికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప ముఖ్య అతిథిగా హాజరై జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్‌డీ శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా ఇ.మధు, ఆర్.సురేష్, ఏ.ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఆర్.వెంకటేష్, సహాయ కార్యదర్శులుగా డి.అరుణాచలం, ఎస్.రఘు, ప్రభాకర్, ఎస్.వెంకటయ్యతో పాటు 17 మంది కమిటీ సభ్యులు నియమితులయ్యారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో చేపట్టాల్సిన పోరాట కర్తవ్యాలను గురించి తెలియజేశారు. ఈనెల 14న అంబేడ్కర్ జయంతి వేడుకలు జిల్లావ్యాప్తంగా నిర్వహించాలని పిలుపు నిచ్చారు.

ప్రొవిజన్ స్టోర్‌లో చోరీ

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లి పంచాయతీలోని శ్రీఆంజనేయ స్వామి గుడి సమీపంలో ఉన్న ఓ ప్రొవిజన్ స్టోర్‌లో చోరీ జరిగింది. సుమారు రూ.లక్ష విలువైన నిత్యావసర సరుకులను సోమవారం రాత్రి అపహరించుకు వెళ్లారు. ప్రొవిజన్ స్టోర్ ముందున్న ఇనుప కంచెను తొలగించి షట్టర్ బద్దలు కొట్టి దుండగులు లోపలకు ప్రవేశించారు. మంగళవారం ఉదయం యథావిధిగా షాపు తెరవడానికి వచ్చిన యజమాని చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న తిరుపతి రూరల్ ఎస్‌ఐ రామకృష్ణ ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. అనంతరం దుకాణ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి



లక్ష్మమ్మ పొలంలోని అక్రమంగా తరలిస్తున్న ఇసుక

చంద్రగిరి: తన పొలానికి ఆనుకుని ఉన్న వంకలో అక్రమంగా ఇసుక తోడేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ మహిళా రైతు మంగళవారం పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి వివరాల మేరకు.. మండల పరిధిలోని నాగయ్యగారిపల్లికి చెందిన లక్ష్మమ్మకు పూర్వీకుల నుంచి ఆంజనేయపురం ఎస్టీ కాలనీ సమీపంలోని స్వర్ణముఖినది వాగుకు ఆనుకుని కొంత భూమి ఉంది. అందులో మామిడిచెట్లు నాటారు. గతంలో నాగరాజ నాయుడు, రితీష్, తులసి, జానకీరామ్ అనే వారు మామిడిచెట్లను తొలగించి దౌర్జన్యానికి పాల్పడ్డారు. దీనిపై గతంలో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. అయితే ఇటీవల లక్ష్మమ్మ భూమిలో అక్రమంగా ప్రవేశించడంతో పాటు పొలానికి ఆనుకుని ఇసుకను తోడేస్తున్నారు. దీనిపై ఆమె స్థానిక పోలీసులను ఆశ్రయించారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



నివారణ చర్యలకు చెందిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యులు,ఆర్టీసీ అధికారులు

తిరుపతి అర్బన్: వేసవి నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బాలకృష్ణనాయక్ తెలిపారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో మంగళవారం వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన అంశాలకు చెందిన పోస్టర్‌ను ఆర్టీసీ డీపీటీవో నరసింహులుతో కలసి ఆవిష్కరించారు. అనంతరం ప్రయాణికులకు ఉచితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఎండలు ముదురుతున్న నేపథ్యంలో ఇంటి పట్టునే ఉండాలని, బయటికి వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ, తలపాగా వంటివి రక్షణగా ధరించాలని సూచించారు. డీపీటీఓ మాట్లాడుతూ వడదెబ్బకు దూరంగా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలకు చెందిన కరపత్రాలను ప్రయాణికులకు అందిస్తామన్నారు. ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ డీఆర్ నాయుడు, వైద్యులు శ్రీనివాసరావ్, పద్మావతి, దీప్తి, లావణ్య, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్ర నాయుడు, డిప్యూటీ డెమో కిరణ్‌కుమార్ ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 7 గంటలకు సూర్యప్రభ వాహన సేవ, రాత్రి 7 గంటలకు చంద్రప్రభవాహన సేవ.
- యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 8 గంటలకు ట్యాలీ కోర్సు శిక్షణ, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు, తిరిగి 6 నుంచి 8 గంటల వరకు కంప్యూటర్ బేసిక్, ఎంఎస్ ఆఫీస్ కోర్సుల శిక్షణ ప్రారంభం.
- జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో భాగంగా బీఈ, బీటెక్ ప్రవేశాల నిమిత్తం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు పరీక్షలు
- ఈనెల 2 నుంచి 28వ తేదీ వరకు ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చేపట్టిన పాలిటెక్ ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణా కార్యక్రమం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహణ.
- ఇస్కాన్ రోడ్డులోని శ్రీరామకృష్ణ మిషన్ ఆశ్రమంలో సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8.30 వరకు ప్రవచన నిధి డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మచే శ్రీమద్రామాయణ ప్రవచనామృతం

ఎర్రచందనం కేసులో వ్యక్తికి ఐదేళ్లు జైలు

తిరుపతి లీగల్ : ఎర్రచందనం దుంగలను వాహనంలో అక్రమంగా తరలిస్తున్న కేసులో చిత్తూరు, ఖాదర్ మిరాన్ వీధికి చెందిన సుమో డ్రైవర్ సత్యమోహన్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ ప్రత్యేక కోర్టు జడ్జి నరసింహమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 2019 మే 17వ తేదీ వైఎస్ఆర్ కడప జిల్లా, రాయచోటి రేంజ్, సరస్వతిపల్లి బీట్, పత్తి కనుమ రాష్ట్ర అటవీ ప్రాంతంలో 39 కిలోల నాలుగు ఎర్రచందనం దుంగలను నిందితుడు సత్యమోహన్ అక్రమంగా సుమో వాహనంలో తరలిస్తుండగా ఫారెస్ట్ అధికారులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు సత్య మోహన్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి సత్యమోహన్‌కు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

పల్లెల్లో రాజకీయ కక్షలు రేపడం సరికాదు

- వైఎస్సార్‌సీపీ కార్యకర్త భూపతిరెడ్డికి పరామర్శ
- నిందితులను కఠినంగా శిక్షించాలి
- చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి డిమాండ్



రుయా ఆస్పత్రిలో కత్తిపోట్లకు గురైన భూపతి రెడ్డిని పరామర్శిస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్ (రామచంద్రాపురం): రామచంద్రాపురం మండలం అనుప్పల్లి పంచాయతీ రేఖలచేనుకు చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త భూపతిరెడ్డిని సోమవారం చంద్రగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పరామర్శించారు. కత్తిపోట్లకు గురైన భూపతిరెడ్డికి అందుతున్న వైద్య సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రాణాపాయస్థితి లేదని చెప్పడంతో మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం దాడికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ప్రశాంతమైన పల్లెల్లో రాజకీయ కక్షలు రేపడం ఎవరికీ మంచిది కాదని, నిద్రిస్తున్న సమయంలో కత్తులతో దాడికి తెగబడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పల్లెల్లో ప్రశాంతత లేకుండా చేయడం తెలుగుదేశం నాయకులకు మంచిదికాదని, ప్రజలు తిరగబడేంత వరకు తెచ్చుకోవద్దని హితవు పలికారు. ఆలయాల వద్ద కూడా రాజకీయాలు చేయడం వారికి మాత్రమే తగునన్నారు. బాధిత కుటుంబానికి తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎద్దుల చంద్రశేఖర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, దేవరాజులురెడ్డితో పాటు గ్రామస్తులు ఉన్నారు.

కాంగ్రెస్ పతనం ఖాయం



ఎస్వీయూలో ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్ఏ నాయకులు

తిరుపతి సిటీ: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల రక్షణ కోసం విద్యార్థి సంఘాలు చేస్తున్న పోరాటంపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దమనకాండ సృష్టించి అక్రమ అరెస్టులు చేయడం దారుణమని ఏఐఎస్ఏ జిల్లా అధ్యక్షుడు రంజిత్ కుమార్ మండిపడ్డారు. మంగళవారం ఎస్వీయూలో ఏఐఎస్ఏ విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 400 ఎకరాలను వేలం వేయడం ద్వారా కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూరుస్తూ వేల కోట్ల రూపాయలను దండుకునేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ ప్రయత్నిస్తోందని విమర్శించారు. హెచ్‌సీయూ భూముల జోలికి వెళ్లడం అంటే ప్రభుత్వం తన పతనాన్ని కోరుకోవడమేనని హెచ్చరించారు. ప్రజాస్వామ్యాన్ని ఏడవ వాగ్దానంగా చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి తమ పరిపాలనలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థుల అక్రమ అరెస్టులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ వేణు, వంశీ, కృష్ణవంశీ, మహేంద్ర, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి సంరక్షణే లక్ష్యం



అష్టావధానం చేస్తున్న ఎస్ఎస్‌యూ విద్యార్థి ఉప్పలధడియం భరత్ శర్మ

తిరుపతి సిటీ: భారతీయ సంస్కృతి సంరక్షణే ధ్యేయంగా ఎన్ఎస్‌యూ పనిచేస్తోందని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. జాతీయ సంస్కృత వర్సిటీ ఉత్కల పరిషత్, తెలుగు విభాగం, వేమ భూపాల కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో కల్చరల్ ఇంటిగ్రేషన్, ప్రమోషన్, సంస్కృతి అధ్యయనంలో భాగంగా మంగళవారం ఉత్కల దివస్ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డిప్యూటీ సిటీ ప్లానర్ సంపూర్ణానంద మహాపాత్రతో కలసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ వర్సిటీలో ఒడిశా విద్యార్థులు అధికంగా ఉన్నారని, భారతీయ సంస్కృతి ఇంటిగ్రేషన్, పరస్పర అధ్యయనం వంటి విషయాలలో వర్సిటీ కృషి ప్రశంసనీయమన్నారు.

ఆకట్టుకున్న భరత్‌శర్మ అష్టావధానం

ఉత్కల దివస్ మహోత్సవంలో భాగంగా వర్సిటీ యూజీ విద్యార్థి ఉప్పలదడియం భరత్ శర్మ చేసిన అష్టావధాన ప్రక్రియ వీక్షకులను ఆకట్టుకుంది. సంచాలకులుగా దామోదర్‌నాయుడు, పృచ్ఛకులుగా డాక్టర్ నాగరాజు, సమస్యాపూర్తికి నందన్‌రావు, వర్ణన పృచ్ఛకులుగా గోలి వేంకట సుబ్రహ్మణ్యశర్మ, న్యస్తాక్షరికి సీతారామశర్మ, ఆశువు విషయానికి ఆచార్యులు నల్లన్న, దత్తపదికి చక్రవర్తి రంగనాథన్, చందోభాషణ అంశానికి శతావధాని ఆముదాల మురళి, అప్రస్తుత ప్రసంగానికి గంగిశెట్టి లక్ష్మీనారాయణ వ్యవహరించారు. డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్, ఉత్కల పరిషత్ అడ్వైజర్ ప్రొఫెసర్ శంకర్‌నారాయణ, రిజిస్ట్రార్ వెంకటనారాయణ, ఒడిశా చైర్ డైరెక్టర్ డాక్టర్ జ్ఞాన రంజనపండా, పరమిత పండా, డాక్టర్ లీనాచంద్ర పాల్గొన్నారు.

కాస్త రిలీఫ్..



పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. పరీక్షలు మొదలైన రోజు నుంచి టెన్షన్ పడుతూ పరీక్షలు రాసిన విద్యార్థులకు నేటితో కూల్ అయ్యారు. పరీక్ష ముగిసిన అనంతరం పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు ఒకరిని ఒకరు హత్తుకుని ఇక మన స్కూల్ రోజులు ముగిశాయి.. కాలేజీలోకి అడుగు పెడుతున్నాం అంటూ కేరింతల కొడుతూ విద్యార్థులు సందడి చేశారు. ఈ దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. – సాక్షి ఫోటోగ్రాఫర్, తిరుపతి

విభాగాలను విలీనం చేస్తే ప్రతిఘటిస్తాం

తిరుపతి సిటీ: ఉన్నత విద్యామండలి ఆదేశాల పేరిట ఎస్వీయూలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందంటూ కోర్సులను విలీనం చేస్తే ప్రతిఘటిస్తామని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, వైఎస్సార్‌సీపీ, ఏఐఎస్ఏ, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్ఓ, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాలు హెచ్చరిస్తూ మంగళవారం ప్రకటన విడుదల చేశాయి. పేద విద్యార్థులను ఉన్నతవిద్యకు దూరం చేసే ప్రక్రియలో భాగంగా విభాగాల విలీన ప్రక్రియ చేస్తున్నారని మండిపడ్డారు. కళాశాల ప్రిన్సిపల్స్, విభాగాధిపతులపై ప్రత్యేకమైన ఒత్తిడి తీసుకువస్తూ అకడమిక్ కన్సల్టెంట్ సంఖ్యను తగ్గించాలని, కొంతమంది అధికార పార్టీ నాయకుల ఒత్తిడి తీవ్రమైందని చెప్పుకోలేక బాధపడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా వర్సిటీలో విభాగాల విలీన ప్రక్రియ మానుకుని, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించి ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష నోటిఫికేషన్‌లో అన్ని కోర్సులను యథావిధిగా కొనసాగించాలన్నారు. అలాగే సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులకు సంబంధించిన సీట్లను ఎటువంటి పరిస్థితుల్లో తగ్గించకూడదని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అఖిలపక్ష విద్యార్థి సంఘాల నాయకులతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని ఆ ప్రకటనలో హెచ్చరించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ, పోలీసులు

తిరుపతి సిటీ: విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై పూర్తి అవగాహన పెంచుకుని తాము పాటిస్తూ ఇతరులను చైతన్య పరచాలని ట్రాఫిక్ సీఐ సంజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం ఎస్వీ ఓరియంటల్ డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలను డ్రైవింగ్ చేస్తున్న సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. తద్వారా ప్రమాదం జరిగిన సమయంలో రక్షణ కవచంగా ఉంటుందన్నారు. యువత మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వాహనదారులు లైసెన్స్ తప్పక కలిగి ఉండాలని లేనిపక్షంలో అపరాధ రుసుంతో పాటు కేసులు తప్పవని హితువు పలికారు. సైబర్ నేరాలు పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఈడీ హేమంత్ కుమార్, కె.భూపతి నాయుడు, సంజయ్ రెడ్డి, అన్నపూర్ణ, డాక్టర్ భాస్కర్, శర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

షరా మామూలేగా..!



ప్రకాశం భవన్ ఎదుట ఓపెన్ గ్రౌండ్‌లో తాగిపడేసిన మద్యం బాటిళ్లు

తిరుపతి సిటీ: శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ మందుబాబులకు అడ్డాగా మారుతుందంటూ గతంలో సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో ఆగమేఘాల మీద అధికారులు వర్సిటీని జల్లెడ పట్టి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగ ఉన్న ప్రాంతాల్లో సుమారు ట్రాక్టర్ మేరా మందు బాటిళ్లను ఏరివేసి శుభ్రం చేశారు. ఆ రెండు రోజుల పాటు రాత్రి సమయంలో పోలీసులు, వర్సిటీ సెక్యూరిటీతో పెట్రోలింగ్ నిర్వహించి చేతులు దులుపుకున్నారు.. మళ్లీ మందుబాబులు వర్సిటీలో సాయంత్ర వేళలో తిష్టవేస్తున్నారు. ప్రధానంగా ప్రకాశం భవనం ఎదురుగా ఉన్న ఓపెన్ ఆడిటోరియం గ్రౌండ్‌లో రాత్రి సమయాల్లో బయటి వ్యక్తులు సిట్టింగ్ కేంద్రంగా మార్చుకున్నారు. విచ్చలవిడిగా మద్యం సేవించి బార్‌ను తలపించేలా ఖాళీ బాటిళ్లను అక్కడే విసిరేస్తున్నారు. వర్సిటీ పెద్దసంఖ్యలో మద్యం బాటిళ్లు కనిపిస్తుండడంతో విద్యార్థినులు చూసి భయభ్రాంతులకు గురవుతున్నారు. సరస్వతీ నిలయంలో ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలను అధికారులు కట్టడి చేయకపోతే వర్సిటీకి చెడ్డపేరు తప్పదని పలువురు విద్యార్థులు, మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీపీని సన్మానించిన టీడీపీ నేతలు



తిరుపతి రూరల్ ఎంపీపీ చంద్రమోహన్ రెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండల పరిషత్ అధ్యక్షులుగా ఎన్నికైన మూలం చంద్రమోహన్ రెడ్డిని ఓటేరుకు చెందిన టీడీపీ నేతలు సూర్యకిరణ్, ఇస్మాయిల్ మంగళవారం కలసి ఘనంగా సత్కరించారు. గత ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీలో చేరిన ఆ ఇద్దరు నాయకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీపీగా గెలిచిన మూలం చంద్రమోహన్‌రెడ్డిని కలసి సత్కరించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సన్మాన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, వేదాంతపురం సర్పంచ్ చెరకుల జనార్దన్ యాదవ్, వైఎస్సార్‌సీపీ పార్టీ మండల అధ్యక్షుడు మునీశ్వరరెడ్డి, ఓటేరు ఎంపీటీసీ రాణియమ్మ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు



పోలీసులతో మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి రూరల్ : తిరుపతి నగరంలోని పద్మావతీపురానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త బాలాజీ సోషల్ మీడియా వేదికగా టీటీడీ పాలక మండలి సభ్యులు భానుప్రకాష్ రెడ్డిని ఉద్దేశించి అభివృద్ధిని అడ్డుకోవద్దని, టీటీడీ నిధులు తిరుపతి పారిశుధ్యానికి వినియోగించాలని, అలా చేయని పక్షంలో ఆత్మహత్య చేసుకుంటా అని మెసేజ్ పెట్టినందుకు తిరుపతి రూరల్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఆ విషయం తెలుసుకున్న తిరుపతి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ భూమన అభినయ్ రెడ్డి తన అనుచరులతో పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని పోలీసుల తీరును తప్పుబట్టారు. చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ వద్దకు వెళ్లి ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా..? ఇదెక్కడి చట్టం అంటూ నిలదీశారు. పోలీసులు ఆయన మాటలు పెద్దగా పట్టించుకోకపోవడంతో అక్కడే ఆందోళన చేసేందుకు ప్రయత్నించారు. దీంతో సోషల్ మీడియా కార్యకర్త బాలాజీకి 41(సి) నోటీసు అందజేసి విడుదల చేశారు. దీంతో భూమన అభినయ్ రెడ్డితో పాటు ఆయన వెంట వచ్చిన పార్టీ నేతలు అందరూ పోలీస్ స్టేషన్ నుంచి వెనుదిరిగి వెళ్లారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ఆలయ ధ్వజస్తంభాన్ని నీటితో శుద్ధి చేస్తున్న ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్ర బాబు

చంద్రగిరి: చంద్రగిరిలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఈ నెల 6 నుంచి 14వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనంలో భాగంగా గర్భాలయం అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ దేవేంద్ర బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరి బాబు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

6న ధ్వజారోహణం..

ఈనెల 6వ తేదీ ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 10వ తేదీ హనుమంత వాహనంపై స్వామివారు విహరిస్తారు. 11న శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామి వారికి స్నపన తిరుమంజనం, 12న సీతారాముల కల్యాణోత్సవం, అదేరోజు గరుడ వాహనంపై స్వామివారు ఊరేగుతూ భక్తులను కటాక్షించనున్నారు. 14న తేదీ ఉదయం 9 నుండి 10 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సర్లకు, చక్రత్తాళ్వార్‌కు వసంతోత్సవం, తరువాత చక్రస్నానం వైభవంగా నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. 15వ తేదీ ఉదయం శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా నిర్వహించనున్నారు.